క్లుప్తంగా

ముస్లింలకు ఇఫ్తార్ విందు



నాగిరెడ్డిపేట: మండల కేంద్రం గోపాల్‌పేట మసీదులో శుక్రవారం మాల్తుమ్మెద సొసైటీ మాజీ చైర్మన్ రాంచందర్‌రెడ్డి సహకారంతో ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. రాంచందర్‌రెడ్డి ప్రస్తుతం అమెరికాలో ఉండటంతో ఆయన సూచన మేరకు సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గోపాల్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ హంజీనాయక్, ఉపసర్పంచ్ కిషన్, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్‌ఖాన్, నాయకులు అజీజ్, జహంగీర్, శ్రీధర్‌రావ్, మధు, ఎజాజ్, సల్మాన్ పాల్గొన్నారు.

ఆలయం వద్ద బీటీ రోడ్డు

భిక్కనూరు: ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆదేశాలతో భిక్కనూరు మండల కేంద్రంలోని శ్రీ సిద్ధరామేశ్వరాలయం నుంచి పెద్దమల్లారెడ్డి లింక్ రోడ్డు వరకు బీటీ రోడ్డు వేసినట్లు సర్పంచ్ తున్కి వేణు తెలిపారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రోడ్డు పనులు చేపట్టినట్లు వెల్లడించారు.

బీజేపీ నేతల రిలే నిరాహార దీక్ష విరమణ

మద్నూర్: పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించాలనే డిమాండ్‌తో బీజేపీ నేతలు చేపట్టిన రిలే దీక్షలను తహసీల్దార్ అనిల్‌కుమార్ శుక్రవారం విరమింపజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో వారు దీక్ష విరమించారు. హామీ మేరకు పేదలకు ఇళ్లు నిర్మించకపోతే నిరాహార దీక్ష చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు హన్మండ్లు తెలిపారు.

ప్రతి గ్రామంలో బీఆర్‌ఎస్ జెండా పండుగ

తాడ్వాయి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మద్ది మహేందర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25న బీఆర్‌ఎస్ జెండా పండుగ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సిములు, ఆత్మకమిటీ చైర్మన్ సాయిరెడ్డి, రాంరెడ్డి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పాము.. ఆందోళనలో భక్తులు




దోమకొండ: మండలంలోని సంగమేశ్వర గ్రామ వెంకటేశ్వర ఆలయంలో శుక్రవారం నాగుపాము ప్రత్యక్షం కావడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. గర్భగుడిలో ఉన్న వెంకటేశ్వరస్వామి విగ్రహంపై నాగుపాము కన్పించడంతో స్థానికుల సహాయంతో పాములు పట్టే విక్రమ్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఆలయం వద్దకు చేరుకొని పామును చాకచక్యంగా పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలేశాడు.

25 నుంచి సమ్మె



బాన్సువాడ : తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఆర్టిజన్లు 25 నుంచి సమ్మె చేయనున్నట్లు బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు జిన్న దత్తు అన్నారు. శుక్రవారం ఆయన ట్రాన్స్‌కో డీఈ కామేశ్వరరావుకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈయన మాట్లాడుతూ ఒకే సంస్థలో రెండు వేర్వేరు సర్వీసు రూల్స్ ఉండడం వల్ల స్టాండింగ్ ఆర్డర్ రద్దు చేసి ఏపీఎస్ ఈబి సర్వీసు రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్లు హరికృష్ణ, విజయ్‌కుమార్, హన్మండ్లు, రమేష్ పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో సాందీపని విద్యార్థుల ప్రతిభ



కామారెడ్డి టౌన్: తెలంగాణ యూనివర్సిటీ శుక్రవారం ప్రకటించిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక సాందీపని విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన బీఎస్సీ విభాగంలో ఎం.భానురేఖ 9.84 జీపీఏ, బీఏ విభాగంలో సమీహా హుస్సేన్‌నిదా 9.72 జీపీఏ, బీకాంలో హారిక 9.64 జీపీఏ సాధించారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ఆర్. హరిస్మరణ్‌రెడ్డి, ప్రిన్సిపల్ సాయిబాబు అభినందించారు.

రంజాన్ కానుక.. పేదలకు భరోసా

- ప్రభుత్వం సరఫరా చేసిన కానుకలు జిల్లా వ్యాప్తంగా పంపిణీ
- మరికొన్నిచోట్ల నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన దాతలు



లింగంపేటలో కానుక అందజేస్తున్న ఎంపీపీ



గాంధారి మండలంలో రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ సత్యంరావు



నిజాంసాగర్ మండలం మహమ్మద్‌నగర్‌లో..



పిట్లంలో సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రంజాన్ తోఫా కానుక పేద ముస్లింలకు పండుగ పూట భరోసా కల్పించినట్లైంది. ప్రభుత్వం సరఫరా చేసిన కానుకను జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రజాప్రతినిధులు శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మరికొన్ని చోట్ల కొంతమంది దాతలు ముందుకొచ్చి సరుకులు పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఇందులో భాగంగానే నిజాంసాగర్ మండలంలోని మహమ్మద్‌నగర్, మాగి, వెల్గనూర్ గ్రామాల్లో సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మాచారెడ్డి మండలం గన్‌పూర్ (ఎం) గ్రామంలో సర్పంచ్ లత, ఉప సర్పంచ్ మల్లేశ్ యాదవ్, గాంధారి మండలం సర్వాపూర్, గౌరారం, ముదొల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఏఎంసీ చైర్మన్ సత్యంరావు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. అదేవిధంగా మండల కేంద్రమైన లింగంపేటలో ఎంపీపీ గరీబున్నీసాబేగం, తహసీల్దార్ రాజేశ్వర్, భిక్కనూరు మండలంలోని కాచాపూర్‌లో ఎంపీపీ గాలిరెడ్డి, మాజీ ఎంపీపీ తొగరి సుదర్శన్, సర్పంచ్ సులోచన పలువురికి రంజాన్ కానుక అందజేశారు. దీంతో పాటు మండల కేంద్రమైన బిచ్కుందలో బీఆర్‌ఎస్ నాయకుడు షేక్ పాషా, మండల కేంద్రమైన రాజంపేటకు చెందిన బల్ల ఆంజేయుల కుమారుడు బల్ల సాయి తేజ, పిట్లం మండల కేంద్రంలో సర్పంచ్‌లు నారాయణరెడ్డి, కవిత, బీఆర్‌ఎస్ నాయకులు విజయ్, శేక్ కరీం పలువురికి బియ్యంతో పాటు వివిధ రకాల సరుకులను పంపిణీ చేశారు.



రాజంపేటలో..



మాచారెడ్డి మండలం గన్‌పూర్(ఎం)లో..



బిచ్కుందలో సరుకులు..

ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడవాలి



షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్

బాన్సువాడ: మనిషి తన జీవితంలో మానవత్వంతో వ్యవహరించాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. పట్టణంలోని సత్సంగ్ వద్ద రూ.10 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను స్పీకర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి సన్మార్గంలో నడవాలని, అప్పుడే సత్సంగ్‌కు విలువ ఉంటుందని అన్నారు. మందిరాలు, మసీదుల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, సత్సంగ్ ప్రతినిధులు శంకర్‌లాల్ మహారాజ్, ఆగమయ్య, శివదయశ్‌వర్మ, పంచాయితీ రాజ్ ఈఈ సమత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి మరచి విమర్శలా?



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దోమకొండ: బీఆర్‌ఎస్ నాయకులు అభివృద్ధిని మరచి కాంగ్రెస్‌కు చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీని విమర్శిస్తూ కాలయాపన చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, దోమకొండ, బీబీపేట కాంగ్రెస్ మండల అధ్యక్షులు చంద్రయ్యగారి అనంతరెడ్డి, సుతారి రమేష్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు నియోజకవర్గంలోని పలుచోట్ల భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గం వెనుకబాటుకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కారణం అన్నారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ కుటుంబంపై అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని, వెంటనే క్షమాపణలు చెప్పాలని బీఆర్‌ఎస్ నేతలకు సూచించారు. సమావేశంలో నాయకులు సీతరం మధు, రామస్వామిగౌడ్, పులబోయిన రమేష్, గోపాల్‌రెడ్డి, ప్రసాద్, సిద్దారెడ్డి, నర్సింలు, భషీర్, నాగారపు లింగం తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తే ఫోన్ చేయండి



లింగంపేట: మండల కేంద్రంతో పాటు ఐలాపూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం షీ టీమ్ విధులు, సైబర్ నేరాల నివారణకు సంబంధించి అవగాహన కల్పించినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. మహిళలను వేధించినా, అసభ్యంగా ప్రవర్తించినా 100 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. లాటరీ తగిలిందని, రుణాలు ఇస్తామని ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లు నమ్మొద్దని సూచించారు.

మొక్కలను సంరక్షించాలి



పిట్లం మండలం బ్రాహ్మణపల్లిలో మొక్కలకు నీళ్లు పడుతున్న ఎంపీడీవో వేంకటేశ్వర్లు

పిట్లం: నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం వాటర్ డే సందర్భంగా ఆయన మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో హరితహారంలో నాటిన మొక్కలకు సర్పంచ్ బీరప్పతో కలిసి నీళ్లు పట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరెడ్డి, ఎంపీవో బ్రహ్మం, ఏపీవో శివకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు విజయ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కామారెడ్డి రూరల్: మొక్కలను సంరక్షించాలని ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలోని మొక్కలకు నీళ్లు పట్టారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్‌నాయక్, సిబ్బంది రమేష్, సత్యనారాయణ ఉన్నారు.

వేతనాలు పెంచాలి



జెడ్పీ వైస్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు



భిక్కనూరు ఎంపీవోకు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

బీబీపేట: వేతనాలు పెంచాలని ఐకేపీలో పని చేస్తున్న వీవోఏలు శుక్రవారం జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం రూ. 3,900 మాత్రమే వేతనం చెల్లిస్తున్నారని నిబంధనల మేరకు వేతనాలు పెంచేలా కృషి చేయాలని కోరారు.

భిక్కనూరు: కనీస వేతనాలను అమలు చేయాలని వీవోఏలు తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, ఎంపీవో ప్రవీన్‌కుమార్, ఏపీఎం శ్రీనివాస్‌లకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు.

నాగిరెడ్డిపేట: ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించకపోతే 24 నుంచి సమ్మెలోకి వెళ్తామని వీవోఏలు శుక్రవారం మండల సమైక్య అధ్యక్షురాలు సుగంధ, ఏపీఎం జగదీష్‌కుమార్‌కు నోటీసు అందజేశారు. అనంతరం తహసీల్దార్ సయిూద్ అహ్మద్ మస్రూర్, ఎంపీడీవో రఘును కలిసి సమస్యను వివరించారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం గౌరవ అధ్యక్షుడు బాలకిషన్, మండల అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షులు సుజాత, కార్యదర్శి సాయిబాబా, సహాయ కార్యదర్శి సుభాషిని, కోశాధికారి దావీద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

■ **ఘనంగా శివపార్వతుల కల్యాణం**



హోమంలో పాల్గొన్న భక్తులు

నిజాంసాగర్: మండలంలోని మాగి గ్రామ అంజనేయస్వామి, శివ పంచాయతన ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయ నిర్మాణకర్త శ్రీనివాస్ దంపతులు శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవానికి మాగి, గోర్గల్, ఒడ్డేపల్లి, మల్లూర్ గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు.

■ **ఊరదమ్మకు నైవేద్యం**

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలో శుక్రవారం ఊర పండుగనుఘనంగా నిర్వహించారు. ఊరదమ్మ, కట్ట మైసమ్మలకు భక్తి శ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం గావు రంగాలను ఎత్తి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అరిగె సాయిలు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కంది మల్లేష్,పెద్ద గౌడ్ రామాగౌడ్,పెద్ద కాపు లచ్చయ్య పాల్గొన్నారు.

■ **సంతోషిమాత ఆలయంలో పూజలు**

భిక్కనూరు: మండల కేంద్రంలో సంతోషిమాత ఆలయంలో వైశాఖమాసం తొలి శుక్రవారం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహికంగా లలితా చాలీసాను పఠించారు.

■ **శబరి మాత ఆశ్రమంలో పల్లకీ సేవ**

తాడ్వాయి: తాడ్వాయిలోని శబరి మాత ఆశ్రమంలో గురువారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు శబరి మాత ప్రతిమ, దివ్య సమాధి వద్ద వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు చేశారు.

ధాన్యాన్ని పూర్తిగా కొంటాం

- డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



తాండూర్‌లో కాంటా వేస్తున్న ఎంపీపీ రాజ్‌దాస్



బోర్లంలో కాంటా వేస్తున్న డీసీసీబీ చైర్మన్



లింగంపేట మండలం మెంగారంలో..

బాన్సువాడ రూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తామని ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం బోర్లం, జక్కల్‌దాని తండాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను డీసీసీబీ డైరెక్టర్ సంగ్రాం నాయక్, ఏఎంసీ చైర్మన్ నర్సింహులు, సర్పంచ్ సరళతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే రైతులకు ఎ–గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,060, బి–గ్రేడ్ రకానికి రూ.2,040 ప్రకారం మద్దతు ధర చెల్లిస్తామని తెలిపారు.

నాగిరెడ్డిపేట: మండలంలోని మాల్తుమ్మెద, మాల్తుమ్మెదగేట్, వదల్పర్తి, పోచారం, తాండూర్ గ్రామాల్లో ఆయా సహకార సంఘాల చైర్మన్లు నర్సింలు, గంగారెడ్డి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ సభ్యు డు మనోహర్ రెడ్డి, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మన్ నారాయణ, ఏవో విజయశేఖర్, ఏఈవో బబిత, సహకార సంఘాల సీఈవోలు జైపాల్‌రెడ్డి, పవన్ పాల్గొన్నారు.

రాజంపేట: మండలంలోని పొందుర్తి గ్రామంలో జంగంపల్లి సింగిల్‌విండో చైర్మన్ బోండ్ల సిద్దరాములు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సర్పంచ్ పని గంగకిషన్, మండల రైతుబంధు చైర్మన్ మోహన్ రెడ్డి, సీఈఓ రమేష్ పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలోని మెంగారం, శెట్పల్లిసంగారెడ్డి, మాలపాటి, పొల్కంపేట, లొంకల్‌పల్లి గ్రామాల్లో సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, సర్పంచ్ అనిల్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

బిచ్కుంద: మండలంలోని సితరాంపల్లిలో ఎంపీపీ అశోక్ పటేల్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మద్నూర్: డోంగ్లీ మండలంలోని మదన్‌హిప్పర్గా గ్రామంలో సర్పంచ్ రాజుపటేల్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని తెలిపారు.



మద్నూర్ మండలం మదన్‌హిప్పర్గాలో..



రాజంపేట మండలం పొందుర్తిలో..

నీళ్ల ట్యాంకు ప్రారంభం



నీళ్ల ట్యాంకును ప్రారంభిస్తున్న ఎంపీపీ

లింగంపేట: మండలంలోని కొయ్యగుండు తండా, ఎల్లమ్మ తండాల్లో రిలయన్స్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంకులను శుక్రవారం ఎంపీపీ గరీబున్నిసాబేగం ప్రారంభించారు. వేసవిలో గిరిజనులు తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ట్యాంకులను నిర్మించినట్లు రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ పులగం రాజు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్, డీపీవో వీరేశం, సర్పంచ్‌లు లలిత, రాందాస్, భీంరావు, రాజయ్య పాల్గొన్నారు.

అన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు

గాంధారి: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీవో సతీష్ అన్నారు. శుక్రవారం ఆయన తిప్పారం, సోమారం తండా, గొల్లాడి తండా గ్రామాల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు.

సబ్సిడీపై పెరటికోళ్ల పంపిణీ



పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజ్‌దాస్



మత్తమాలలో ఎంపీపీ మాధవి..

నాగిరెడ్డిపేట: ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసిన పెరటి కోడి పిల్లలను శుక్రవారం నాగిరెడ్డిపేటలో ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్ రెడ్డి, మండల పశువైద్యాధికారి రవికుమార్ ఆత్మకూరు, లింగంపల్లికలాన్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 45 కోడి పిల్లలున్న ఒక్కో యూనిట్ ధర రూ. 3,330 కాగా ప్రభుత్వం రూ. 2,250 సబ్సిడీ ఇస్తుందన్నారు. లబ్ధిదారుడు కేవలం రూ. 1,080 చెల్లిస్తే సరిపోతుందని వారు పేర్కొన్నారు.

మత్తమాలలో..

ఎల్లారెడ్డి: మండలంలోని మత్తమాల గ్రామంలో ఎంపీపీ మాధవి, వెటర్నరీ డాక్టర్ డాక్టర్ అర్చన, సర్పంచ్ అశోక్‌రెడ్డి పలువురికి పెరటి కోళ్ల సబ్సిడీపై పంపిణీ చేశారు.

కలుషిత నీటికి అడ్డుకట్ట

సాక్షి ఎఫెక్ట్..



ఎల్లారెడ్డిరూరల్: మిషన్ భగీరథ పథకం నుంచి ఎల్లారెడ్డిలో జలగలతో కూడిన నీటి సరఫరా అవుతున్న తీరుపై శుక్రవారం సాక్షి దినపత్రికలో 'మిషన్ భగీరథ నీటిలో జలగలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ స్పందించారు. కమిషనర్ తన సిబ్బందితో కలిసి 8వ వార్డు లో సరఫరా చేసిన నీటిలో జలగలు వచ్చిన ఇంటి యజమానులతో మాట్లాడారు. నీరు కలుషితం అవుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ఏర్పడిన గుంతలను పూడ్చి వేయించారు. వార్త ప్రచురించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన సాక్షి యాజమాన్యానికి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సంక్షిప్తం

సబ్‌స్టేషన్ కోసం స్థలం ఎంపిక

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం అవసరమైన స్థలం ఇచ్చేందుకు సర్పంచ్ పాతిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. తీర్మాణప్రతిని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నాగార్తి భూంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఏఎస్‌ఆర్ ఫౌండేషన్స్ అధ్వర్యంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ మాట్లాడుతూ రక్త దానం కొందరి ప్రాణాలను నిలబెట్టువచ్చన్నారు. ఏఎస్‌ఆర్ ఫౌండేషన్స్ వ్యవస్థాపకుడు సంతోష్, ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్ పాల్గొన్నారు.

సీపీఆర్ విధానంపై అవగాహన

భిక్కనూరు: అకస్మాత్తుగా సంభవించే గుండెపోటు వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకునేందుకు నిర్వహించే సీపీఆర్ పద్దతిపై డాక్టర్ యెమిమా శుక్రవారం స్థానిక మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలిరెడ్డి, జెడ్పీటీసీ పద్మనాగభూషణంగౌడ్, ఎంపీవో ప్రవీన్‌కుమార్, ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్షంతో రైతన్నకు తీవ్ర నష్టం

నిజాంసాగర్: మండలంలోని ముగ్దుంపూర్, గాలీపూర్, కొమలంచ, గిర్నితండా పంచాయతీల్లో శుక్రవారం రాత్రి వడగండ్లతో కూడిన వర్షం కురవడంతో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. కొన్నిచోట్ల నీటి ప్రహానికి ధాన్యం కొట్టుకొనిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

నాగిరెడ్డిపేట: మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం రాత్రి వచ్చిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

మద్నూర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని డోంగ్లీ మండలం పెద్ద టాక్లీ సర్పంచ్ రాజాబాయి సూచించారు. శుక్రవారం ఆమె పెద్ద టాక్లీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఎంపీపీ గాలిరెడ్డి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు.

అర్థిక చేయూతనివ్వాలి

నాగిరెడ్డిపేట: మహిళాసంఘ సభ్యులకు ఆర్థిక చేయూతనివ్వాలని మండల సమైఖ్య అధ్యక్షురాలు సుగంధ సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ఏపీఎం జగదీష్‌కుమార్, మండల సమాఖ్య ఉపాధ్యకురాలు శాంతమ్మ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నస్రుల్లాబాద్: బీర్కూర్ మండలంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి నస్రుల్లాబాద్ మండలానికి చెందిన కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ పథకాలకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీపీ పాల్త్య విఠల్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

భిక్కనూరు: భిక్కనూరు శ్రీ సిద్ధరామేశ్వరాలయం అభివృద్ధికి నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటకు చెందిన సిద్ధరాములు, భాగ్యమ్మ దంపతులు రూ.11,500, తిప్పాపూర్‌లో లక్ష్మి వెంకటేశ్వరాలయానికి టీచర్ రాజేశ్వరి రూ. 9,999 విరాళం ఇచ్చారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూధన్ (ACO) : 9951027699
ఎల్లారెడ్డి: డి.యస్.ఎస్. గౌడ్ : 9573130288
కామారెడ్డి: కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899